ప్రజాశక్తి

శుక్రవారం 6 డిసెంబర్ 2024

5



పారా లీగల్ వాలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పరిధిలో పారా లీగల్ వాలంటీర్ గా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ కంపల్లె శైలజ సూచించారు. ఈ విషయంపై ఆమె గురువారం మాట్లాడుతూ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించే నిమిత్తం పారా లీగల్ వాలంటీర్లను ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు.. పదవ తరగతి లేదా అందుకు సమాన విద్యార్హత కలిగి 18 సంవత్సరాల నిండిన యువతీ,యువకులు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 21వ తేదీ లోపు హిందూపురం మండల న్యాయ సేవాధికారి సంస్థ కార్యాలయానికి చేరేలా చూసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మౌఖిక పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అసలు కంటే కొసరెక్కువ..!





- ◆ జనంపై విద్యుత్ ఛార్జీల బాదుడు
- ◆ విద్యుత్ బిల్లు రూ.295... ఇతర ఛార్జీలు రూ.459..!
- ◆ రూ.100 నుంచి రూ.500 వరకు విద్యుత్ ఛార్జీల భారం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ బారాలను మోపింది. గత నెల నుంచే ట్రూఅప్ ఛార్జీల భారాన్ని వేయగా ఈసారి ట్రూఅప్‌తోపాటు ఇంధన సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్‌పిపిసిఎ) పేరుతో అదనంగా భారాన్ని వేసింది. దీంతో అసలు విద్యుత్ ఛార్జీల కంటే కొసరు ఛార్జీల భారం సామాన్యులపై పడింది. విద్యుత్ బిల్లులు పెంచమంటూ హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే వివిధ రూపాల్లో విద్యుత్ భారాలు మోపడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రుఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజల నుంచి అసలు కంటే కొసరు రూపంలోనే ఎక్కువగా వసూలు చేస్తుండడం గమనార్హం.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

విద్యుత్ ఛార్జీలకు సంబంధించి అక్టోబరు నెలతో పోలిస్తే నవంబరు, డిసెంబరు మాసాల్లో వచ్చిన విద్యుత్ బిల్లులు ఒక్కో వినియోగదారుడిపైనా రూ.100 నుంచి రూ.500 వరకు అదనపు భారం పడింది. అనంతపురం జిల్లాలో 6.22 లక్షల మంది గృహ విద్యుత్ వినియోగదారులున్నారు. వీరందిపైనా వివిధ రూపాల్లో భారాన్ని 30 శాతానికిపైగా విధించింది. వినియోగదారుల వారీగా చూసినప్పుడు మచ్చుకు కొన్ని ఉదాహరణలుగా ఇలాగున్నాయి.

గత నెలకంటే అదనం

అనంతపురం నగరంలోని హౌసింగుబోర్డు పరిధిలోనున్న వినియోగదారుడు సర్వీసు నంబరు 7112301078097కు నవంబర్ నెల విద్యుత్ బిల్లు రూ.947 వచ్చింది. ఇందులో విద్యుత్ వినియోగంపై వచ్చిన బిల్లు ఛార్జీ రూ.741 కాగా 2024 -9 ఎఫ్‌పిపిసిఎ రూ.69.60 విధించారు. ట్రూఅప్ కింద రూ.55.96 ఇతర ఛార్జీలు కలిపి మొత్తం రూ.947 బిల్లు వచ్చింది. అదే సర్వీసు నంబరులో డిసెంబర్ నెల బిల్లులో చూస్తే రూ.1044 వచ్చింది. ఇందులో విద్యుత్ ఛార్జీ బిల్లులు రూ.705 కాగా ఎఫ్‌పిపిసిఎ 04 రూ.131 , ఎఫ్‌పిపిసిఎ 10 రూ.71 ఇది కాకుండా ట్రూఅప్ మరో రూ.55 బిల్లులో చేర్చారు. రూ.257 రూపాయలు అదనంగా భారాన్ని వేయడం జరిగింది.

విద్యుత్ వినియోగ ఛార్జీ రూ295... అదనం రూ.459..!

అనంతపురం నగరంలోని మున్నానగర్‌లో ఒక వినియోగదారుడికి చూస్తే అసలు కంటే కొసరే ఎక్కువ వచ్చింది. 7112101012026 సర్వీసు నంబరుపై డిసెంబరు నెల బిల్లు రూ 754 వచ్చింది. ఇందులో విద్యుత్ వినియోగంపై వచ్చిన ఛార్జీలు చూస్తే రూ.295 ఉంది. ఎఫ్‌పిపిసిఎ 04 ఛార్జీల కింద రూ.227, ఎఫ్‌పిపిసిఎ 2024 10 రూ.58.80, సర్‌ఛార్జీ కింద రూ.25, ట్రూఅప్ ఛార్జీలు రూ.65.77 ఇలా అన్ని రకాల అదనపు బాధుడులను ప్రజలపై వేసింది. అసలు ఛార్జీ కంటే 60 శాతం అధికంగా అదనపు ఛార్జీలను వినియోగదారులపై వేసింది. మొత్తంగా చూసినప్పుడు ప్రతి వినియోగదారుడిపైనా గత బిల్లు కంటే 30 శాతం అదనంగా ట్రూఅప్ చార్జీలు, ఎఫ్‌సిసిఎ ఛార్జీల పేరుతో వినియోగదారులపై భారాన్ని వేసింది. ఛార్జీల పెంచబోమని ఎన్నికలకు ముందు హామీనిచ్చి ఇప్పుడు ఈ భారాలేమిటోనని వినియోగదారులు ఘొల్లు మంటున్నారు.

కియాతో ఉద్యోగాల వెలుగు

◆ మంత్రులు వాసంశెట్టి సుభాష్, ఎస్.సవిత ◆ కియా పరిశ్రమ సందర్శన

ప్రజాశక్తి-పెనుకొండ

కరువు జిల్లా ఉమ్మడి అనంతపురానికి కియా పరిశ్రమ ఉద్యోగ వెలుగులు తెచ్చిందని రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితమ్మ తెలిపారు. యర్రమంచి గ్రామం వద్ద ఉన్న కియా కార్ల పరిశ్రమను గురువారం పరిశీలించారు. కియా సీఈవో కబ్ డాంగ్లీ, హెచ్ఒడిలు హాన్, మా, శాంగ్ జే, డా॥పాటిల్, డా॥సోమశేఖర్ రెడ్డి తదితరులు పరిశ్రమ ప్రగతిపై మంత్రులకు వివరించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ కియా, అనుబంధ సంస్థల్లో సుమారు 20 వేలమంది ఉపాధి పొందడం హర్షణీయం అన్నారు. నూతన సాంకేతిక ప్రమాణాలతో కియా కార్లను ఉత్పత్తి చేస్తోందన్నారు. పరిశ్రమల స్థాపనపై వైసిపి పాలనలో పూర్తి నిర్లక్ష్యం కొనసాగిందన్నారు. గత వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పలు పరిశ్రమల్లో భద్రత లోపాల కారణంగా 34 మంది కార్మికులు మరణించారన్నారు. ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతత్వంలో వసుధ మిత్రా కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. వసుధా మిత్రా కమిటీని కియాలో సందర్శించేలా చర్యలు తీసుకుంటామన్నారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ కియా ట్రైనింగ్ సెంటర్‌లో యువతకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అభివృద్ధి పథంలో పయనిస్తున్న కియాకు ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా సహాయక సహకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కియా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



కియా ప్రతినిధులతో కలిసి కారును పరిశీలిస్తున్న మంత్రులు సుభాష్, సవిత

ఉద్యోగాల కల్పనే ధ్యేయం : మంత్రి సుభాష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి

రాష్ట్రంలో విరివిగా పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర కార్మిక, పరిశ్రమలు, బాయిలర్స్, ఇన్సూరెన్స్, ఆరోగ్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మతో కలిసి పరిశ్రమల యజమానులు, ప్రతినిధులు, కార్మిక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదాన్ని ప్రవేశపెట్టారన్నారు. కార్మికుల భద్రత, సంక్షేమం, ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై యాజమాన్యాలు దృష్టి సారించేలా చర్యలు తీసుకుంటోందన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పారిశ్రామిక రంగం కుంటుపడిందన్నారు. అనంతపురం జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారని తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి అవకాశాలు ఉన్నాయని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

మున్సిపల్ కార్యాలయంపై విజిలెన్స్ నిఘా..!

హిందూపురం మున్సిపల్ కార్యాలయంపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం. ఇక్కడ గతంలో విధులు నిర్వహించిన మున్సిపల్ కమిషనర్, ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న విభాగ అధికారి కలిసి వినియోగంలో లేని బ్యాంకు ఖాతాల నుంచి లక్షల రూపాయల్లో నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అవినీతి జరిగిన విభాగంపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు విశ్వసనీయ సమాచారం.

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలో పరిపాలన సౌలభ్యం కోసం ఆరు విభాగాలు ఉన్నాయి. ఇందులో రెవెన్యూ విభాగం వారు పురపాలక సంఘ వ్యాప్తంగా ఇంటి పన్ను, నీటి పన్నుతో పాటు పురపాలక సంఘం ఆధీనంలో ఉన్న వాణిజ్య భవనాలకు సంబంధించిన అద్దెలను వసూలు చేసి పురపాలక శాఖ ఖాతాకు జమ చేస్తారు. ట్రేడ్ లైసెన్స్ సంబంధించిన పన్నులను శానిటేషన్ విభాగం వారు వసూలు చేసి పురపాలక శాఖకు జమ చేయడం జరుగుతుంది. వీటితో పాటు పెద్ద మొత్తంలో పట్టణ ప్రణాళిక విభాగం వారు వాణిజ్య సముదాయ భవనాలు, గృహ నిర్మాణాలు, అపార్ట్‌మెంట్లు, లే అవుట్లు పురపాలక శాఖ పరిధిలో చేపడితే నిబంధనల మేరకు ఫీజులను విధించి, ఆ నిధులు పురపాలక ఖాతాలకు జమ చేయిస్తారు. ఈ నిధులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు రావడంతో పాటు 15వ ఆర్థిక సంఘ నిధులు, అమృత్ పథకం నిధులు ఇలా కోసం కోట్లాది రూపాయల నిధులు వస్తాయి. వచ్చిన నిధులను పట్టణంలో ప్రజా అవసరాల కోసం చేపట్టే అభివృద్ధి పనులను కౌన్సిల్ ఆమోదం జరిగి, టెండర్ ద్వారా అభివృద్ధి పనులు చేపడతారు. పనులు పూర్తి అయిన అనంతరం ఇంజనీరింగ్ విభాగం వారు చేసిన పనుల నాణ్యతను పరిశీలించి, ఎంత పని చేశారో పుస్తకాల్లో రికార్డు చేసిన అనంతరం బిల్లుల మంజూరు కోసం అకౌంట్స్ విభాగానికి పంపడం జరుగుతుంది. ఈ నిధులు పురపాలక సంఘంలో వివిధ పద్దుల కింద ఉన్న నిధుల నుంచి చెల్లింపులు జరుగుతాయి. అయితే గతంలో పట్టణ అభివృద్ధి కోసం వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి నిధి (బిఆర్‌జిఎఫ్), 13వ ఆర్థిక సంఘం, కరువు నిధులు ఇలా పెద్ద ఎత్తున కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు హిందూపురం పురపాలక సంఘానికి వచ్చాయి. ఖర్చు చేసి మిగిలిన నిధులు ఆయా ఖాతల్లోనే ఉన్నాయి. ఈ నిధులు ఎన్ని ఉన్నాయి..?, ఏ నిధులు ఉన్నాయి..?, మిగిలిన నిధులు ఏ పద్దు కింద ఖర్చు చేయాలని అనే విషయాలు అకౌంట్స్ విభాగం, మున్సిపల్ కమిషనర్‌కు మాత్రమే తెలుస్తాయి. ఇలా వచ్చి మిగిలిన నిధులు అప్పట్లో ఖర్చు చేయక పోవడంతో ఆయా ఖాతాల్లో అలాగే ఉన్నాయి. ఆ బ్యాంకు ఖాతలు సైతం వినియోగంలో లేవు (నాన్ ఆపరేటీవ్ అకౌంట్స్). ఈ ఖాతాలపై ఏడాది క్రితం ఇక్కడ విధులు నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ కన్ను పడింది. ఈ నిధులను ఏలాగైన కాజేయాలని అకౌంట్స్ విభాగం అధికారితో కలిసి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. దీంతో బినామి పేర్లతో ఖాతాలో ఉన్నా నిధులను స్వాహా చేసినటుల తెలుస్తోంది. వీటితో పాటు మరో ఖాతాలో ఉన్న నిధులను కాజేయడానికి ప్రత్యేక డిడిఒ అకౌంట్ ను సైతం ప్రారంభించి పెద్ద ఎత్తున మున్సిపల్ నిధులను దోచుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నిధులతో పాటు గత ప్రభుత్వంలో వార్డు

ఓ విభాగంపై ప్రత్యేక దృష్టి..?



హిందూపురం మున్సిపల్ కార్యాలయం

పరిధిలో జరిగే కార్యక్రమాలతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం కోసం ఆయా సచివాయాలకు వచ్చిన నిధులను సైతం అడ్మిన్ సెక్రేటరీలకు ఆదేశించి, ఆ నిధులను సైతం డ్రా చేయించి మొత్తం డబ్బులు దిగమింగిన కమిషనర్ అడ్మిన్ సెక్రేటరీల చేతుల్లోకి మిఠాయి బాక్సులను పెట్టి పంపారన్న ఆరోపణలున్నాయి. ఇలా పురపాలికలో ఉన్నా నిధులను అడ్డదారిన దోచుకోవడానికి ఎన్ని అవకాశాలు ఉంటే అన్ని చోట్ల కమిషనర్ దోచుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాలు బయటకు పొక్కడంతో ఓ ఆర్‌టిఐ కార్యకర్త అకౌంట్స్ కు సంబంధించి పూర్తి వివరాలతో సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరినప్పటికి ఏడాది గడచినా ఇంత వరకు ఇవ్వలేదు. ఇదే విషయాలపై విజిలెన్స్ అధికారులు అన్ని వివరాలతో ఓ విభాగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారని తెలుస్తోంది. త్వరలో మున్సిపల్ కార్యాలయంపై వారు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమచారం.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మెప్మా అధికారులపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలో మహిళా పొదుపు సంఘాల పేరుతో కొంతమంది అధికారులు నకిలీ సంఘాలను తయారు చేసి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతున్నారని సిఐటియు నాయకులు విమర్శించారు. సిఐటియు ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు టీ. అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలో వందలాదిమంది మహిళలు మహిళా పొదుపు సంఘాలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవడం కోసం బ్యాంకులలో రుణాలు తీసుకుంటూ ఆ రుణాలను కంతులు వారీగా జమ చేసుకుంటూ వారి జీవన విధానాలను మెరుగుపరుచుకుంటున్నారన్నారు. అయితే ఆ మహిళా సంఘాలను ఆసరాగా చేసుకొని కొంతమంది మెప్మా అధికారులు, మహిళా గ్రూపుల లీడర్లు నకిలీ మహిళా పొదుపు గ్రూపులను తయారుచేసి బ్యాంకులలో కోట్లాది రూపాయలు రుణాలు డ్రా చేసుకుంటూ వారి దందాలను కొనసాగిస్తున్నారని విమర్శించారు. మహిళలతో ఎలాంటి సంతకాలు గాని గ్రూప్ ఫోటోలు గానీ లేకుండా, బ్యాంకులలో డబ్బులు డ్రా చేస్తున్నారన్నారు. బ్యాంక్ అధికారులు కూడా ఇలాంటివాటికి పరోక్షంగా సహకరిస్తున్నారన్నారు. నిజాయితీగా పొదుపు చేసుకున్న మహిళలకు రుణాలు ఇవ్వడానికి అనేక రకాల ఆంక్షలు విధించే బ్యాంకర్లు ఇలాంటి వారికి ఏ విధంగా రుణాలు మంజూరు చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు జెవి. రమణ, టి. అయూబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ పాల్గొన్నారు.

తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి- పెనుకొండ

తుఫాను వలన నష్టపోయిన వరి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని పరిధిలోని ఎర్రమంచి, రాంపురం, కురుబవాండ్లపల్లి గ్రామాల వరి రైతుల పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా వచ్చిన తుఫాన్ వల్ల హరిపురం, కురుబ వాండ్లపల్లి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వరి కోసి కళ్లాల్లో ఆరపోసే సమయంలో తుఫాను వచ్చిందన్నారు. దీంతో వరి కళ్లాల్లోనే తడిసి మొలకెత్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరా వరిసాగుకు రూ. 35 వేల నుంచి రూ. 40వేల పెట్టుబడి పెట్టారని అన్నారు. వడ్లు కప్పడానికి ఉపయోగించిన ప్లాస్టిక్ పట్టలకు వేల రూపాయలు ఖర్చు చేశారని అన్నారు. ఈ నేపథ్యంలో రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రైతులకు జరిగిన నష్టాన్ని వ్యవసాయ అధికారిని కె.చందనకు వివరించారు. తక్షణం అధికారులు, ప్రభుత్వం స్పందించి గ్రామాలవారీగా సర్వే నిర్వహించాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా తుఫాన్ వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాకమిటీ సభ్యులు ఫకృద్దీన్, రైతులు నరేష్, లక్ష్మణ, చంద్ర, రాజా, ఆంజనేయులు, రఘురామ్, విరజిన్నప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



తడిచి పోయిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

సచివాలయాల సిబ్బందికి బయోమెట్రిక్ తప్పనిసరి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో జిల్లాలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి బయోమెట్రిక్ పై చర్చించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు డిపిఒ సమత, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది బయోమెట్రిక్‌ను కార్యాలయాలకు వచ్చే ముందు వెళ్లే ముందు తప్పనిసరిగా వాడాలన్నారు. వీటిని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పరిశీలించాలన్నారు. పాఠశాలల్లో ఏయే అంశాలు పెండింగ్ లో ఉన్నాయో సంబంధిత ఎంపీడీవోలు నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు.

7న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్

7న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు జిల్లాలో కూడా విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశాలు పాఠశాలల, విద్యార్థుల అభివృద్ధికి దోహద పడతాయన్నారు. సంబంధిత అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

గృహ నిర్మాణంలో అధికారులు బాధ్యతతో పని చేయాలి

గృహ నిర్మాణ రంగంలో అధికారులు బాధ్యతగా పనిచేసే నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారి వెంకటనారాయణతో పాటు ఆ శాఖ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా 72353 ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా దాదాపు 22500 పూర్తి అయ్యాయని చెప్పారు. మిగిలిన ఇళ్లను 2025 మార్చినాటికి పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పనులు పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల అనుమానాలను నివృత్తి చేస్తూ సత్వరమే నిర్మాణాలు పూర్తి కావడానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రెండు రోజుల్లో గృహ నిర్మాణాల పురోగతిపై నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పురోగతి కల్పించకపోతే సంబంధిత అధికారులకు మెమోలు జారీ చేస్తామన్నారు. ఈ సమావేశంలో ధర్మవరం, కదిరి, పెనుకొండ, పుట్టపర్తి ఏఈలు శంకర్ లాల్, శ్రీనివాస్, శివకుమార్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు

చంద్రబాబు చేతుల మీదుగా ప్రత్యేక క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేస్తూ, ఆయా మంత్రుల ఫోటోలతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటోలు ఉన్న ప్రత్యేక క్యాలెండర్‌ను సత్య సాయి జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరింప చేశాడు. గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి కార్యాలయంలో చంద్రబాబును కలిసి 2025 నూతన క్యాలెండర్ ను విడుదల చేయించారు. అందులో ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలను పొందుపరచడం పట్ల ముఖ్యమంత్రి సామకోటిని అభినందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు బెల్లం తిరుపాలు, శంకర్ పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ముదిగుబ్బ : ముదిగుబ్బ పాత ఊరిలో గురువారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి రమేష్ బాబు, నాయకులు తుమ్మల సూరి, నందకృష్ణ, డిష్ రామాంజనేయులు, నల్లని వెంకటనారాయణ, చిన్న నాయుడు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని కదిరేపల్లి, కోటిగానిపల్లి గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త శ్రీదేవి, ఎంపిపిస్కూల్ సునీత, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి - అగళి

స్థానిక ఇందిరమ్మ ఎస్సీ కాలనీ లోని తాగునీటి సమస్య నెలకొంది. దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. నెల రోజుల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఇంతకుముందు ఉన్న పైప్ లైన్ ధ్వంసం కావడంతో నీటి సమస్య ఏర్పడిందని సమస్యను ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి ఇందిరమ్మ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య తీర్చాలని కాలనీవాసులు సిద్ధప్ప, మంజమ్మ, హనుమంతరావు, గుండమ్మ, తిమ్మరాజమ్మ తదితరులు కోరుతున్నారు.

డీలర్ల సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలో నెలకొన్న డీలర్ల సమస్యను పరిష్కరించి రేషన్ కార్డుదారులకు సకాలంలో రేషన్ బియ్యం పంపిణీ చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు గురువారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ నారాయణస్వామికి అందజేశారు. అనంతరం రెవెన్యూ కార్యాలయం ఎదుట అరగంట పాటు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, నాయకులు డాబా కిష్ట, తిప్పయ్య, తుమ్మల చిన్నప్ప, రాధాకృష్ణ, చెన్నప్ప, ప్రసాద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు కంటిపరీక్షలు

ప్రజాశక్తి మడకశిర రూరల్

మండలంలోని జిల్లెడగుంట మండల పరిషత ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఉచిత కంటిపరీక్షలు నిర్వహించారు. నీలకంఠాపురంలోనిఎల్వి ప్రసాద్ నేత్ర విద్య విజ్ఞాన సంస్థ టెక్నీషియన్ గోవర్ధన్, గిరిధర్, శిల్ప ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూతన్న, ఉపాధ్యాయులు సుధారాణి, సునీత, ఇందిరమ్మ, లలితమ్మ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ సంగం శ్రీనివాసులుకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి రొద్దం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎల్ఎటిఒ డాక్టర్ తిప్పయ్య, డబ్ల్యూహెచ్ఒ డాక్టర్ ప్రశాంత్, పిపిఎం కోఆర్డినేటర్ నాగేంద్ర గురువారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని టీ. బి రిజిస్టర్,రికార్డులను పరిశీలించి టిబి, లెప్రసీ కేసుల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి డాక్టర్ సి.ఎస్ సోమశేఖర్, డాక్టర్ భాగ్యలక్ష్మి, సిహెచ్ఒ విజయలక్ష్మి, శశిధర్, చాంద్ బాషా, గిరినాథరావు తదితరులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధుల పై సర్వే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అసంక్రమిత వ్యాదులు మరియు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నిడిమామిడి గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వైద్యచ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సునిల్ ,ఎం సి డి, ఆర్ పి ఎస్కె పోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత, వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు ఆరోగ్య సలహాలను అందజేశారు. ఆరోగ్య కరమైన ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్య కరమైన జీవనం సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, సూపర్ వైజర్ వెంకట రమణ , ఆరోగ్య కార్యకర్తలు శివ, మంజుల, పి. సుస్మిత, అంగనవాడి టీచర్ వేదవతి, ఆశా కార్యకర్త నిర్మల, మమతాజ్, హసీనా 104 సిబ్బంది లక్ష్మీపతి, మోహన్ పాల్గొన్నారు.

ఇష్టపడి చదవండి : డీఎస్పీ

ప్రజాశక్తి - కదిరిఅర్బన్

మంచి ఆలోచనతో ముందుకు వెళ్ళి, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా ఉన్నత విద్యా శిఖరాలను అధిరోహించాలని డిఎస్పి శివ నారాయణ స్వామి విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్ ఆవరణంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిడి, సామాజిక సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, విద్యా సంబధిత సమస్యలు, పరీక్షల ఒత్తిడి, సెల్ ఫోన్ ప్రభావం, స్నేహితుల ప్రభావం, మాదక ద్రవ్యాల ప్రభావం, గుడ్ టచ్, బాడ్ టచ్, డయల్ 100 గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ నారాయణ రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు వెంకటాచలం, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

కోర్టు ఉత్తర్వులు అమలు చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైం

యానిమేటర్లను విధుల నుంచి అక్రమంగా తొలగించడం తగదని వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ విమర్శించారు. గురువారం పుట్టపర్తిలో ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల పత్రాలను సంబంధిత శాఖ అధికారులకు అందజేస్తే వారు తీసుకోవడం లేదన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి క్రింది స్థాయి అధికారుల వరకు ఎవరికి హైకోర్టు ఉత్తర్వు పత్రాలు అందజేసిన వారు ఏవేవో కారణాలు చెప్పి తీసుకోలేదన్నారు. అందుకే ఆ పత్రాలను రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా సంబంధిత అధికారులకు పంపుతున్నట్లు తెలిపారు. హైకోర్టు ఉత్తర్వు పత్రాలను ఎందుకు తీసుకోవడం లేదో కూడా అధికారులు చెప్పకపోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే తన అనుచరులను అదుపులో పెట్టుకోవాలన్నారు. చిరుద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తే వారికి అండగా సిఐటియు పోరాటం సాగిస్తుందని హెచ్చరించారు. అధికారులు ఫలానా కారణాల వల్ల తాము ఆ పత్రాలు తీసుకోవడం లేదని రాతపూర్వకంగా ఇస్తే అదే సమస్యపై మరోసారి హైకోర్టుకు వెళదామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్, ఐకెపి యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ఉత్తర్వులు రిజిస్టర్ పోస్టు చేయడానికి వెళుతున్న యానిమేటర్లు

సమన్వయంతో పార్టీ అభివృద్ధికి కృషి చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

అందరిని సమన్వయం చేసుకుని హిందూపురం నియోజకవర్గంలో పాటు జిల్లా వ్యాప్తంగా కురుబలను ఐక్యం చేసుకుని పార్టీ అభివృద్ధికి కషి చేయాలని రాష్ట్ర కురుబ కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శివకు వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి సూచించారు. బుధవారం తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్, హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డిలతో కలిసి రాష్ట్ర కురుబ కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శివ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డిని కలిశారు.ఈసందర్భంగా జగన్‌ను సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం శివ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో కురుబ కార్పొరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలను తిరిగి కురుబలను ఐక్యం చేసి పార్టీని అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డికి పుష్ప గుచ్ఛం అందిస్తున్న శివ

నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలని వినతి

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని కోడిగేనహల్లి ఏపీఆర్ఎస్ పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన నాడు నేడు పనుల్లో భారీగా అవకుతవకలు జరిగాయని వీటిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి డిమాండ్ చేశారు. పనుల్లోని అవినీతిపై పాఠశాల పూర్వ విద్యార్థులు ఏపీ ఆర్ఇ సొసైటీ ఉన్నతాధికారులకు గతంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఏపీఐఈ సొసైటీ అధికారుల ఆదేశాల మేరకు గురువారం డిప్యూటీ సెక్రటరీ సురేష్ బాబు వెంకటరమణ పాఠశాలలో విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో బాబావలి అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో ఉన్న చెట్లను అమ్మడం అదేవిధంగా మరుగుదొడ్ల రిపేరి ఉందని నిధులు మంజూరు చేసుకుని దుర్వినియోగం చేయడం, విద్యార్థుల దగ్గర పనులు చేపించుకోవడం లాంటి అనేక అరోపణలు ఉన్నాయన్నారు. వీటి పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి మురళి తదితరులు పాల్గొన్నారు.


విచారణ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బాబావలి

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం రెవెన్యూ డివిజన్లో జరిగే రెవెన్యూ సదస్సును పగడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహశీల్దార్లకు, విఆర్ఒలకు, ఆర్ఐలకు, డిఐఒఎస్‌లకు, వివిధ ప్రభుత్వ విభాగాల నుండి డిప్యూటీలుగా ఎంపిక చేసిన అధికారులకు, సిబ్బందికి శిక్షణా తరగతులను గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సులో ఎటువంటి పొరపాట్లకు, నిర్లక్ష్యానికి తావు ఇవ్వరాదని, అలా జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం కచ్చితంగా రెవెన్యూ సదస్సును నిర్వహిస్తూ, తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని తెలిపారు. ఇప్పటికే అన్ని మండలాలలో రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ తేదీలను విడుదల చేశామన్నారు. ఆ తేదీల ప్రకారం కచ్చితంగా ప్రజలకు, రైతులకు న్యాయం జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో ప్రభుత్వ భూములను అక్రమంగా తీసుకున్న వాటి అంశాలపై ప్రత్యేక నిఘా ఉంచి, ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు.. రెవెన్యూ సదస్సులో విచారణ, స్పష్టమైన వాస్తవాలను దృష్టిలో ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎఒ ఖతిజున్‌కుప్రాతో పాటు ఏడు మండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట :భూ సమస్యల పరిష్కారానికి శుక్రవారం నుంచి రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ బాబురావు తెలిపారు. 6న సామ చేను బైలు, సోమయాజులపల్లి 11న జీన్లకుంట, 12 టి పెద్ద తండా, 13 న కురుమామిడి, 17 వేపరాల, 18 జి పెద్ద తండా, 19 మల్ల మీద పల్లి, 20 చామల గొంది, 24 మడుగు వారు గొంది, 25 కటారపల్లి, 27 గొడ్డివెలగల, 31 కంపల్లి, 2న తుమ్మల బయలు, 3 గాండ్లపెంట ఈ గ్రామాలలో రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు రైతులు అర్జీలతో పాటు ఆధార్ జిరాక్స్ సెల్ ఫోన్ నెంబర్ జత చేసి ఇవ్వాలని ఆయన తెలిపారు.

మడకశిర : మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ గ్రామసదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ కరుణాకర్, డిటి లక్ష్మీనరసింహ తెలిపారు. ఈ సదస్సులో రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అర్జీదారులు అన్ని ఆధారపత్రాలతో గ్రామసభలకు హాజరు కావాలని కోరారు.

చిలమత్తూరు : మండలంలో శుక్రవారం నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ యూనస్ బాబు తెలిపారు. అందుకు సంబంధించిన గ్రామ రెవెన్యూ సదస్సుల జాబితాను బుధవారం విడుదల చేశారు 6 న శెట్టి పల్లి, 10 న చాగలేరు,11 న యగ్నిశెట్టిపల్లి,12న గాండ్లదిన్నె, చౌడిరెడ్డిపల్లి, 13న కోడూరు,17 టేకులోడు, 18న హుస్సేన్ పురం, 19న సోమఘట్ట, 20న వీరాపురం, 24న కొడికొండ, 26న నారేముద్దేపల్లి, మర్రిమాకులపల్లి, 27న మొరసలపల్లి, 31న ఎస్ ముదిరెడ్డిపల్లి, యర్రసింగేపల్లి, జనవరి 2 న దేమకేతేపల్లి, 3 న సుబ్బరావు పేట, 7 న కానుగామాకులపల్లి, కంబాలదిన్నె, 8 న చిలమత్తూరు 1,2,3 లలో రెవెన్యూ సదస్సులు జరుగుతున్నట్లు తెలిపారు. రైతులు పాల్గొని రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా తహశీల్దార్ యూనస్ బాబు కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న ధర్మవరం ఆర్డీవో మహేష్


రసాయనాలతో నేలకు ప్రమాదం


తాడిమర్రిలో రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ

ప్రజాశక్తి - లేపాక్షి

జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రపంచం నేలల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులు, రైతులు హాజరైన ఈ కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ నేలలో ఎటువంటి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయంతో వ్యవసాయాన్ని కొనసాగించడం ద్వారా నేలల ఆరోగ్యాన్ని కాపాడగలమన్నారు. దీంతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందడమే కాకుండా పెట్టుబడి ఖర్చులు తగ్గించడానికి సాధ్యమవుతుందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మూడు నెలల క్రితం విద్యార్థులు రైతుల పొలాలలో తీసిన మట్టి నమూనాల పరీక్ష ఫలితాల నేల ఆరోగ్య కార్డులను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ నాగరాజు, ఎడిఎ అల్తాఫ్ అలీ ఖాన్ సనావుల్లా, మండల వ్యవసాయ అధికారి శ్రీలత, పుట్టపర్తి టెక్నికల్ ఎఒ రవీంద్ర, భూసార పరీక్ష కేంద్రం అనంతపురం ఏవోలు ఉమామహేశ్వరి, రుమాన బేగం, ఏఈవో పుష్పలత, ఆర్ఎస్కే సిబ్బంది, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

తాడిమర్రి.: ఆచార్య ఎన్‌జి రంగా విశ్వ విద్యాలయం, రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ నేలల దినోత్సవాన్ని మండలంలోని చిల్లకొండయ్యపల్లిలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా వేరుశెనగ ప్రాజెక్టు సంబంధించి గ్రామానికి సంబంధించి అన్ని వర్గాల నుంచి ఎంచుకున్న రైతుకు చిత్రావతి అనే రకం వేరుశగన విత్తనాన్ని ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పోగ్రాంకోఆర్డినేటర్ డాక్టర్ మల్లీశ్వరి. డాక్టర్ మాధవి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ శశికళతో పాటు రైతులు పాల్గొన్నారు.


కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

వడ్డెర్ల సంఘం మండల కమిటీ ఏర్పాటు


ప్రజాశక్తి - నల్లచెరువు

వడ్డెర్ల సంఘం మండల కమిటీని ఏర్పాటు చేశారు. స్థానిక గీతామందిరంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షులుగా డేరంగుల తిరుపాల్, ఉపాధ్యక్షులుగా పి. వేమయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డేరంగుల తిరుపాల్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన డివిజన్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెర్ల సంక్షేమానికి కృషి చేస్తాననానరు. ఈ కార్యక్రమంలో తనకల్లు జయరాజు, జెపిటి ఆంజనేయులు, వీరాంజనేయులు, జె. వెంకటేష్, ఆనంద్, దొడ్డప్ప, శ్రీరాములు, జయ రామానుజులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల హైస్కూల్‌లో ఆధార్ కేంద్రం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ఇటీవల తీసుకొచ్చిన అపార్ కార్డుల నేపథ్యంలో విద్యార్థులు తల్లిదండ్రులు ఆధార్ లో తప్పులు సరిద్దడం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అపార్ కోసం ఆధార్‌లో తప్పులు సరిదిద్దం కోసం ప్రత్యేక ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు .ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఆధార్ సెంటరును ప్రారంభించారు . ఈసందర్భంగా ఆర్డీవో సన్యాసిరావు, కమిషనర్ కిరణ్ కుమార్, తహశీల్దార్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఆధార్ కేంద్రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోరారు.


ఆధార్‌కేంద్రంలో అధికారులు

ఉపాధ్యాయుడి మృతి బాధాకరం : యుటిఎఫ్

ప్రజాశక్తి -పెనుకొండ

అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఇజాజ్ అహమ్మద్ మృతి బాధాకరమని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయ చంద్రా రెడ్డి, ఎం. సుధాకర్, జిల్లా గౌరవ అధ్యక్షులు కే భూతన్న, ఉపాధ్యక్షులు జిహెచ్ బాబు, సహాధ్యక్షురాలు సీతామాలక్ష్మి, కోశాధికారి డి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్లు మారుతి శ్రీనివాస్, మేరీ వరకుమారి, జిల్లా కార్యదర్శిలు, తాహిర్ వలి, సుబ్బారెడ్డి, నరేష్ కుమార్, శివకుమార్, లక్ష్మీనారాయణ, నర్సింగప్ప, అనిల్ కుమార్, లతా దేవి జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మహంతేశ్వర తదితరులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటలు జరగకుండా ఉండాలంటే ప్రభుత్వం వెంటనే పాఠశాలలో నైతిక విలువలు పెంపొందే చర్యలు అధికారికంగా చేపట్టాలన్నారు. ఈ విషయంపై మేధావులు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాలతో చర్చించాలని కోరారు. ఉపాధ్యాయుడి మృతికి కారణకులపై చర్యలు తీసుకొని ఉపాధ్యాయుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం మండలం మూడుబావుల గ్రామం క్రాస్‌వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. మండలంఓలని కొత్తకోట గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, సుదర్శన్ రెడ్డి గురువారం సాయంత్రం ధర్మవరం ఉనంచి ద్విచక్రవాహనంలో తమ గ్రామానికి బయలుదేరారు. వీరి వాహనాన్ని మూడు బావుల గ్రామం క్రాస్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మండలం పరిధిలోని రాచువారిపల్లి క్రాస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. మద్యం విక్రయిస్తున్న స్థావరాలపై దాడులు నిర్వహించామన్నారు. కర్నాటక మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని నుంచి టెట్రా ప్యాకెట్లను, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని సిఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఉమామనోహర్ రాజు, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, సురేష్, నరసింహారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలోని కూరగాయలు సంత మార్కెట్ కు వెళ్లే దారిలో నెట్ సెంటర్ సమీపన గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి వివరాల కోసం పోలీసులు విచారణ చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వేరుశనగ, వరి, మొక్కజొన్న ,తదితర పంటల సాగులో ఆధునిక వంగడాలు మేలైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పుట్టపర్తి మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో గురువారం ప్రథమ శ్రేణి క్షేత్ర సందర్శన , శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కదిరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి వి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ వేరుశనగలో అధిక దిగుబడులు, అధిక నికరాదాయం పొందాలంటే ఆధునిక వంగడాలు, మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. రబీ వేరుశనగ సాగులో నూతన వంగడాలైన కదిరి లేపాక్షి, కదిరి చిత్రావతి, కదిరి అమరావతి, విశిష్ట రకాలను సాగు చేసుకోవాలని డాక్టర్ ఆర్ నరసింహులు తెలిపారు. సాగులో కలుపు యాజమాన్యం, ఎరువుల వాడకం గురించి డాక్టర్ అనిత రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సి.వెంకట బ్రహ్మం, ఏఈవో ఆనంద నాయక్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉద్యానవన రైతులు సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఉద్యానవన రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపిపిడి సుదర్శన్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం సూక్ష్మ నీటి సాగు పథకం ద్వారా చిన్న సన్న కారు రైతులతో పాటు పెద్ద రైతులకు డ్రిప్పు, స్ప్రింక్లర్లను 90 నుంచి 70 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తుందన్నారు. 2024-25 సంవత్సరానికి గాను జిల్లాకు 30,000 హెక్టార్లకు ఈ సదుపాయం కేటాయించడం జరిగిందన్నారు. రైతు సేవ కేంద్రాలలో రిజిస్ట్రేషన్ నమోదు చేసుకుని రైతు వాటా చెల్లించిన వారికి ఒక నెలలోపు రైతు ఇంటి వద్దకే పరికరాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని మోపర్ల పల్లికి చెందిన కురుబ గోపాల్ (50)గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో మృతుని కుటుంబాన్ని రాష్ట్ర మంత్రి సవిత పెనుకొండ ఆసుపత్రిలో పరామర్శించారు. ఎంపీ బికె. పార్థసారథి అల్లుడు శశిభూషణ్ మృతుడి గ్రామాన్ని సందర్శించి మృతదేహానికి నివాళులు ర్పించారు. అదే విధంగా గౌరాజుపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త చాకలి పోతన్న అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ అల్లుడు శశిభూషన్ గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, పార్లమెంట్ మహిళా సభ్యురాలు సుబ్బరత్నమ్మ, సర్పంచి మంజు, నారాయణ, మోపర్లపల్లికృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'స్టూడెంట్ చాప్టర్'తో నైపుణ్యం మెరుగుదల


ప్రజాశక్తి -అనంతపురం

విద్యార్థుల నైపుణ్యం మెరుగుపరుచుకునేందుకు స్టూడెంట్ చాప్టర్ తోడ్పడుతుందని ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు పేర్కొన్నారు. జెఎన్‌టియు అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం సెమినార్ హాల్‌లో స్టూడెంట్ ఛాప్టర్ వార్షికోత్సవ కార్యక్రమాన్ని సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా॥అజిత అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇన్‌ఛార్జి విసి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్య మెళకువలు ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, పిఆర్ భానుమూర్తి, స్పెషల్ ఆఫీసర్ ఫర్ మోర్త్ పీజీ ప్రోగ్రాం ఆఫీసర్ సి.శశిధర్, వైశాలి ఘోర్పడే, అరుణకాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై మంత్రికి సిఐటియు వినతులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు కోరారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ నెలనెలా కార్మికులకు వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. కార్మికులకు సకాలంలో వేతనాలు, గ్రాట్యూటీ, బోనస్ వంటి చెల్లించాలన్నారు. 10 సంవత్సరాల పైబడి పని చేస్తున్న కార్మికులందరిని సెమిస్కిల్డ్ వేతనాలు చెల్లించాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు చెల్లించాలన్నారు. ప్రమాదాలకు గురైన కార్మికులకు రూ.25 లక్షలు చెల్లించాలన్నారు. తాగునీరు ఉచితంగా అందించాలని, నీటి మీటర్లు బిగించరాదన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, మున్సిపల్ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందించారు. ఇంజనీరింగ్ కార్మికులకు 36 జీవో ప్రకారం రూ.21 వేలు వేతనాలు ఇవ్వాలన్నారు. నగర విస్తీర్ణం జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, క్యాజువల్ లీవులు అమలు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేసి వారి సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి వై.వెంకటనారాయణ ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందించారు. కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి కార్మికుల యూనియన్ నాయకులు ఎన్.శ్రీనివాసులు, జి.త్రిలోక్‌నాథ్, ఆర్.ఎర్రిస్వామి, వన్నూర్‌స్వామి, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు ముత్యాలప్ప, జిలాన్‌బాషా, గ్రానైట్ టైల్స్, లేయింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎర్రిస్వామిరెడ్డి, వీరయ్య, రాడ్ బెండార్స్ యూనియన్ నాయకులు సూర్యనారాయణ, రాంమ్మోహన్ పాల్గొన్నారు.


సమస్యను వివరిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు